## కన్నులపండువగా ప్రదోష నందిసేవ



ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం కన్నులపండువగా ప్రదోష నందిసేను నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి వెండి నందివాహనంపై ఉంచి ఆలయంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త




## పోలేరమ్మ హుండి రాబడి రూ.13 లక్షలు : ఇఓ



ఈవో శ్రీనివాసులు రెడ్డి

వెంకటగిరి, జూలై 3, ప్రభాతవార్త

పట్టణంలో వెలసి వున్న గ్రామ శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం పోలేరమ్మ అమ్మ వారి ఉండేది అధికారులు లెక్కిం చారు దేవాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. మార్చి 26వ తేది నుండి 3వ తేది వరకు 100 రోజులకు గాను రూ. 1342513ల నగదు, బంగారం 3 గ్రాములు 500 మిల్లీ గ్రాములు, వెండి 84 గ్రాములు, యూఎస్ డాలర్ 30, కువైట్ దినార్ 5 భక్తులు హుండీ ద్వారా సమర్పించారని ఈవో ఆర్వో భూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పర్యవేక్షణ అధికారిగా దేవుని వెల్లంపల్లి శ్రీస్తంభాల గిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎన్. శ్రీధర్ నాయుడులు పాల్గొన్నారు.

# నమ్మినోళ్ళు ముంచేశారు 'బాబు'!

### -సొంత జిల్లాలో సమర్ధనాయకత్వం కరువు !?

### -పార్టీ ప్రక్షాళన చేస్తే తప్ప బలోపేతం కాదంటున్న తెలుగుతమ్ముళ్ళు



ప్రభాతవార్త-తిరుపతి:

"ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు పెద్దలు"అయితే ఈ సూక్తి నలభైఏళ్ళ సుదీర్ఘ రాజకీయచరిత్ర ఉన్న అధికార తెలుగుదేశం పార్టీ పెద్దలకు వర్తించదేమో అన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో పార్టీ పరిస్థితి తయారైంది. బాబు సొంత జిల్లా తిరుపతి ,ప్రాతినిథ్యం వహిస్తున్న చిత్తూరుజిల్లాలో పార్టీకి సమర్ధ నాయకత్వం కరువైంది. గత ఐదేళ్ళలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి అధికార వైసిపిని ఎదుర్కోలేక కొందరు తెలుగుతమ్ముళ్ళు, నేతలు కోవర్టులుగా మారా రని ఏకంగా కార్యకర్తలు చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు మొరపెట్టారు. అలాంటి నేతల పేర్లను స్వయంగా బయటపెట్టి అధినేతలకు వివరించారు. అయినా అప్పటి పరిస్థితుల్లో రెండు జిల్లాల్లోని పార్టీలో కోవర్టులుగా మారిన, పనితీరు మారని నేతలపై అధిష్టానం వేటు వేయలేకపోయారనేది ఇప్పుడు కొందరు టిడిపి నేతలు, కార్యకర్తల్లో అసహనం,ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పుడు అందరి సహకారంతో....కార్యకర్తల ధైర్యంతో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 14 అసెంబ్లీస్థానాలకు గాను తిరుపతిలో జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మినహాయించి 13 మంది ఎమ్మెల్యేలు టిడిపి వారే. ఇప్పుడు పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు బహిరంగంగానే వినిపిస్తున్న వ్యాఖ్యలు. తిరుపతిలో పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, అసెంబ్లీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ తమ వర్గాన్ని తప్ప పార్టీని ,కార్యకర్తలను పట్టించుకోవడంలో విఫలం చెందారని పార్టీ అధిష్టానంకు ఫిర్యాదులు అందాయి. అంతేగాక తిరుపతి ఎమ్మెల్యే జనసేన పార్టీ ఆరణి శ్రీనివాసులు టిడిపి నేతలను, కేడర్‌ను పక్కన పెట్టి, తన వారిని అందలం ఎక్కిస్తున్నారనే విధంగా వ్యవహరిస్తున్నారనేది కార్యకర్తల వాదన. చంద్రబాబునాయుడు శరిష్మాతో పూర్తిగా అధికారంలోకి వచ్చిన టిడిపి ఇప్పుడు చిత్తూరు జిల్లాలో పార్టీని ప్రక్షాళన చేస్తే తప్ప పనిచేయని వారిని, కోవర్టులను పక్కన పెట్టలేరని కార్యకర్తలు బహిరంగంగా చెబుతున్నారు. దీనిపర్యవసానమే చిత్తూరు ఎంపిగా టిడిపి దగ్గుమళ్ళ ప్రసాదరావు గెలవగా, తిరుపతి రాజంపేట పార్లమెంట్ స్థానాల్లో వైసిపి ఎంపిలు గెలిచారనేది ఇందుకు నిదర్శనమంటున్నారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచినా ఎంపి అభ్యర్థిని కోల్పో యారు. ఇక రాజంపేట ఎంపి అభ్యర్థిని పార్టీలో నేతలు సమన్వయంతో లేకపోవడంతోనే ఓడిపోయారనేది అంచనా. జడ్పీ ఛైర్మన్, ఎంపిపిలు, ఎంపిటిసిలు,జడ్పీటిసిలు అన్నీ వైసిపి చేతిలో ఉన్నాయి. పైగా పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లి ద్వారకనాథరెడ్డి, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డిలను ఎదుర్కోవడానికి ఇప్పుడున్న పార్లమంట్ అధ్యక్షులు,ఇన్‌ఛార్జిలు వైసిపినేతలను ఎదుర్కోవడం కష్టమని ప్రజలు ,టిడిపి కార్యకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. పెద్దిరెడ్డి ప్రభావంతోనే తిరుపతి ,రాజంపేట ఎంపిలు గెలిచారనేది సత్యం. ఆయన తీరుపై రెండు జిల్లాల్లో టిడిపి నేతలు ఎవరూ కూడా విమర్శించే స్థాయిలో లేరనేది కార్యకర్తల్లో ఆవేదన.

# కలసికట్టుగా అభివృద్ధి వైపు అడుగులు

### మంచినీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి - ప్రజలకు సేవే పరమావధిగా విధులు

### జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ థామస్, పులివర్తినానిలు





జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్‌ను సన్మానిస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త:

సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లతో పాటు జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సహకారంతో కలసికట్టుగా విధులు నిర్వహించి జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళడానికి కృషి చేయాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో బుధవారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ భారతిల అధ్యక్షతన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు జడ్పీ సిఇఓ గ్లోరియాతో పాటు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ థామస్, పులివర్తినానిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్ల ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, క్షేత్ర స్థాయిలో అన్ని వాటర్ ట్యాంకులు పరిశీలించి క్లీనింగ్ చేయాలని, టిడ్కో ఇళ్ళను సత్వరం పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని అధికారులను కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ఎమ్మెల్యేలకు సూచనలు చేయాలని, అలాగే ఎమ్మెల్యేలు ఇచ్చే సలహాలు, సూచనలు తీసుకుంటే ప్రజలకు మరింత మంచి జరుగుతుందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జడ్పీటిసీ సభ్యులకు ఎలాంటి గౌరవం లేదని, ఈ ప్రభుత్వంలో అందరికి గౌరవం వుంటుందని, ఎమ్మెల్యేలుగా జడ్పీటిసీ సభ్యుల వెంట నడిచి నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా మంజూరు చేయాలని, నియోజకవర్గ పరిధిలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని, కొన్ని గ్రామాల్లో ఇళ్ళపై విద్యుత్ లైన్లు వుండటంతో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వీటిని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ఆదేశించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని మాట్లాడుతూ గ్రామ సచివాయాల్లో వ్యక్తుల పేర్లు వున్నాయని వీటిని పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించడానికి జడ్పీ ఎక్కువ నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే గత ఐదేళ్ళలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, జల వనరులు, విద్యుత్, రహదారులు, భవనాలు, గృహ నిర్మాణశాఖ తరపున చేపట్టిన పనుల పూర్తి వివరాలను అందించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పులివర్తినాని ఆదేశించారు. జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడంతో ఎలాంటి కక్ష్య సాధింపులు వుండవని, స్నేహ పూర్వకంగా ప్రజలకు సేవ చేయాలనేదే తమ ఉద్దేశమన్నారు.

**ఎమ్మెల్యేలను సన్మానించిన జడ్పీ ఛైర్మన్**

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి మొదటి సారిగా హాజరైన ఇటీవల ఎమ్మెల్యేలుగా ఎన్నికైన గురజాల జగన్మోహన్‌నాయుడు, పులివర్తినాని, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ విఎం థామస్‌లను జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. జడ్పీ సమావేశభవనంలో బుధవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పులివర్తినాని, గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ విఎం థామస్‌లు హాజరయ్యారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు

### ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



చంద్రగిరి, జూలై 3 ప్రభాతవార్త:

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి, నిర్వహణ పద్దతులపై ఆరా తీశారు. శాంతి భద్రతలపై సమస్యలను ఆరా తీశారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. గ్రామ స్థాయిలో నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందిని ఉద్దేశించి అన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ క్రమంలో సమస్యపై వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి చర్యలకు ఆదేశించారు. సిఐ రామయ్య, ఎస్ఐలు అనిత, రవీంద్రనాథ్ మండల స్థితిగతులను ఎస్పీకి వివరించారు.

## పోలీసు సిబ్బంది సంక్షేమం తమ విధి

### - ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త:

పోలీసు సిబ్బంది సంక్షేమం పోలీసు శాఖ విధి అని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. పోలీసు సంక్షేమంలో భాగంగా బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో వాహనాల పార్కింగ్ షెడ్ ప్రారంభించి పోలీసు బ్యాండ్ సిబ్బందికి ఎస్పీ బ్యాండ్ యూనిఫాంను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు రిజర్వ్ ఆర్మ్‌డ్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. పోలీసు సిబ్బందికి మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో నూతన బైక్ షెడ్‌ను నిర్మించడం జరిగిందని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఏఆర్ డిఎస్పీలు మహబూబ్‌భాష, ఇలియాజ్‌భాషలు, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### పరిశుభ్రతకు

## ప్రాధాన్యమిద్దాం

### కమిషనర్ అధితి సింగ్



తిరుపతి కార్పొరేషన్, జూలై 3, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతమివ్వాలని, పరిసరాలు, కాలువలు, రహదారులు శుభ్రంగా వుంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మనమందరం కృషి చేద్దామని మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్, తిరుపతి నగరంలోని భవానీ నగర్, రైల్వే కాలనీ సుందరయ్య నగర్, సప్తగిరి నగర్, యశోధ నగర్, మధురా నగర్, ఖాదీ కాలనీ, కేటి రోడ్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం కమిషనర్ పర్యటించారు. సామవాయి మార్గంలో స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించి తగు సూచనలు జారీ చేస్తూ స్వీపింగ్ పనులను పూర్తి స్థాయిలో అనుకున్న మేరకు పూర్తి చేసేలా సిబ్బంది పనితీరు వుండాలన్నారు.

## దళారులను ఏరివేయండి

### - టిటిడి ఈఓ శ్యామలరావు ఆదేశం



తిరుమల,జులై 3ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలకు విచ్చేస్తున్న భక్తులను వసతి, దర్శనం పేరుతో మోసగిస్తున్న దళారులను ఉపేక్షించొద్దని టిటిడి ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. కొండపై దళారులు భక్తులను మోసగిస్తున్న వ్యవహారంపై అందిన ఫిర్యాదులతో బుధవారం ఉదయం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, తిరుమల సిఐలు విజయ కుమార్, సత్యనారాయణ, విఎస్ఓ గిరిధర్, నందకిశోర్‌తో సమావేశం నిర్వహించారు. పాత కేసుల్లో దళారులకు చట్టపరంగా తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పోలీసుఅధికారులకు సూచించారు.

### ఎంఎస్ఎంఇల ఏర్పాటుతో

## నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

### - కేంద్ర మంత్రిని కలిసి విన్నవించిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



కేంద్ర మంత్రిని కలిసి చిత్తూరు జిల్లా అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటుకు వినతి చేస్తున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు తోడ్పాటు అందించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్‌రామ్ మాంఝీతో పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు బుధవారం కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి జితన్‌రామ్ మంఝీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేంద్ర మంత్రితో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల సరిహద్దులో వుండటంతో పాలు పలు పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అనువైన వాతావరణం కల్గి వుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. అలాగే దీర్ఘకాలికంగా జిడినెల్లూరులో ఏర్పాటు కావాల్సిన లెదర్ ఫ్యాక్టరీతో పాటు నగరిలో టెక్స్‌టైల్ పార్క్, కుప్పం, పలమనేరుల్లో గుజ్జు పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణాలను చేపట్టడానికి సహకారం అందించాలని కోరారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభించే అవకాశాలు వున్నాయని ఎంపీ మంత్రికి వివరించారు.

# నగరి కేంద్రంగా యదేచ్ఛగా ఇసుక తరలింపు



కుశస్థలీ నది నుంచి ఇసుక తరలిస్తున్న దృశ్యం

### లంచాల వసూళ్లకు కొత్త విధానం

### నెలకు చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

పుత్తూరు, జూలై 3 ప్రభాతవార్త :

నగరి నియోజకవర్గంలో నగరి కేంద్రంగా ఇసుక స్మగ్లింగ్ యదేచ్ఛగా జరుగుతోంది. అటు ఇసుక అక్రమ రవాణా చేసే వారితో పాటు పోలీస్ శాఖకు కూడా ఇసుక ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఇసుక అక్రమ విక్రయాలతో ప్రతి నెల స్మగ్లర్లు, కొందరు పోలీస్ అధికారులు లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. స్మగ్లర్ల నుంచి ప్రతి నెల లంచాల సొమ్ము తీసుకునేందుకు పోలీస్ శాఖ కొత్త విధానం అనుసరిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నూతన విధానం అమల్లోకి వచ్చింది. గత అయిదేళ్లుగా అమలైన ఈ విధానం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగుతుండడం గమనార్హం.

**చేతికి మట్టి అంటకుండా లంచాలు**

గతంలో అంటే...వైసిపి అధికారంలోకి రాక ముందు పోలీస్ శాఖలో కింది స్థాయి సిబ్బంది స్మగ్లర్ల నుంచి లంచం సొమ్ము తీసుకునేవారు. ఆ విధంగా లంచాల సొమ్ము వసూలు చేయడానికి నగరిలో ఒక సూపర్ కానిస్టేబుల్ వుండేవారు. నగరి నియోజకవర్గమే కాకుండా తూర్పు మండలాల్లోని గాజులమండ్యం నుంచి సత్యవేడు వరకూ పోలీస్ అధికారులకు సంఘ వ్యతిరేక శక్తులకు మధ్య వారధిగా పనిచేసేవారు. ఇసుక, ఎర్రచందనం, బియ్యం స్మగ్లర్లు ఈ సూపర్ పోలీస్‌కు సన్నిహితంగా వుండేవారు. పోలీస్ అధికారుల ఇళ్లలో ఖరీదైన ఫర్నీచర్ కొనుగోలు, పోలీస్ శాఖలో ఫంక్షన్‌లకు, ఇతరత్రా ఖర్చులన్నీ ఈ సూపర్ పోలీసే సమకూర్చేవారు. మొత్తా నికి పోలీస్ అధికారుల ఖరీదైన ఖర్చులు అన్నీ ఈయనే భరించే వాడు. ఈ క్రమంలో ఈ సూపర్ పోలీస్ కూడా ఆర్థికంగా ఎదిగిపోయారు. నగరిలో రెండు ఖరీదైన ఇళ్లు, కార్లు కొనుగోలు చేశారు. కళ్ల ముందే సాధారణంగా వుండే సూపర్ పోలీస్ ఆర్థికంగా బలప డడం సాటి పోలీస్ సిబ్బందికే నచ్చలేదు. ఈ నేపథ్యంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత విధానానికి స్వస్తి పలికారు.

**కొత్త విధానం**

ప్రస్తుతం ఇసుక, బియ్యం స్మగ్లర్ల నుంచి పోలీస్ సిబ్బంది లంచం సొమ్ము నేరుగా తీసుకోవడం మానేశారు. సూపర్ పోలీస్‌ను కూడా పక్కన పెట్టారు. రవాణా శాఖలో లంచాల సొమ్ము వసూలు చేసే విధానాన్ని పోలీస్ శాఖలో ప్రవేశపెట్టారు. నగరి, పుత్తూరు పట్ట ణాల్లో స్మగ్లర్లలో తమకు అనుకూలంగా వుండే వ్యక్తులను ఏజెంట్‌గా పెట్టుకున్నారు. స్మగ్లర్లు ఈ లంచాల సొమ్మును ఆ ఏజెంట్ల అకౌంట్లలోకి ఫోన్ పే, పేటిఎంల ద్వారా వేస్తున్నారు. ఇది కాకుండా నగరి పోలీస్ స్టేషన్ సమీపంలో వున్న ఒక దుకాణ యజమాని పోలీసులకు, స్మగ్లర్లకు మధ్య ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇసుక అక్రమ రవాణా చేసే వారంతా లంచాల సొమ్మును ఈ దుకాణంలో చెల్లిస్తారు. మొత్తం కలెక్షన్ పూర్తయిన తర్వాత ఆ దుకాణ యజమాని లంచం సొమ్మును చేరాల్సిన చోటుకు చేరుస్తారు.

**లక్షల్లోనే లంచాలు**

కేవలం ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రతి నెల లక్షలాది రూపాయల అక్రమ సొమ్ము చేతులు మారుతోంది. గత ప్రభుత్వంలో కేవలం ఇసుక అక్రమ రవాణా చేసే వారి నుంచి నెలకు రూ. 30 లక్షల రూపాయలు వసూలు అయినట్టు తెలుస్తోంది. నగరి కుశస్థలీ నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేసే ప్రతి ట్రాక్టర్‌కు ఒక రోజుకు రూ. 3000 వేలు లంచం చెల్లించాలి. నగరిలో 30 మందికి పైగా ఇసుక విక్రయించే వారు వున్నారు. దాంతో ఒక రోజుకు సుమారు ఒక లక్ష చొప్పున వసూలయ్యేది. అందువల్లే నగరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్ కోసం రాజకీయ నాయకులకు 20 లక్షలు లంచం ఇవ్వడానికి కూడా ముందుకు వచ్చిన అధికారులు లేకపోలేదు. ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఒక రోజుకు గరిష్టంగా ఏడు ట్రిప్‌ల ఇసుక తరలిస్తున్నారు. ఒక లోడ్ ఇసుకను 5000 రూపాయలకు విక్రయిస్తారు. అందులో 1,500 రూపాయల వరకూ ఖర్చులు పోను 3,500 రూపాయలు మిగులుతుంది. దీని ప్రకారం ఒక నెలకు ఎంత లేదన్నా ఆరు నుంచి ఏడు లక్షల ఆదాయం వస్తుంది. అయితే అందరూ ఇసుక ట్రాక్టర్ల యజమానులకు ఈ అవకాశం లేదు. వైసిపిలో వున్న సత్రవాడ, కరకంఠాపురం ప్రాంతాలకు చెందిన కొందరు మాత్రమే ఈ విధంగా సంపాదించగలిగారు. ప్రస్తుతం పట్టణ పరిసర ప్రాంతాల్లోని కుశస్థలీ నదిలో ఇసుక కొరత వల్ల సత్రవాడ పరిసర ప్రాంతాల్లో ఇసుక తవ్వుతున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా ఇసుక దందా కొనసాగుతూనే వుంది. అయితే గతంలో వున్నంత స్థాయిలో లంచాలు వసూలు కావడం లేదు. గత వారంలో టిడిపికి చెందిన కొందరు ట్రాక్టర్లను సీజ్ చేసినపుడు 5000 నుంచి రూ. 10,000 రూపాయలు తీసుకుని ఏ కేసు లేకుండా వదిలిపెట్టేశారు. ప్రస్తుతం వారానికి 5000 ఇస్తే సరిపోతోందని ఇసుక అక్రమ రవాణాదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కుప్పం లయన్స్‌క్లబ్‌కు పది విభాగాల్లో అవార్డులు



కుప్పంరూరల్, జూలై 3 ప్రభాతవార్త

కుప్పం లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు పది విభాగాల్లో అవార్డులు అందజేసినట్లు రీజనల్ ఛైర్మన్ డా॥ మహేష్ తెలిపారు. కుప్పం ప్రాంతంల పేదలకు అండగా నిలవడంతో పాటు ప్రతినెలా ఉచిత క ంటి, గుండె పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలలకు క్రీడాసామగ్రి, ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ లయన్ కృష్ణారెడ్డి, డిస్టిక్ గవర్నర్ డా॥ రామరాజ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. అవార్డులకు కృషి చేసిన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, కార్యదర్శి సెల్వం, కోశాధికారి ప్రసాద్, సభ్యులను అభినందించారు.

## కుప్పంలో ఈడిగ గౌడ కులస్తుల ఆత్మీయ సమావేశం

కుప్పంరూరల్,జూలై 3 ప్రభాతవార్త

కుప్పం పట్టణం పాతపేటలోని కెవి శ్రీనివాసులు కాంప్లెక్స్‌లో ఈనెల 7వతేది ఈడిగ గౌడ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు సభ్యులు నారాయణ, వెంకటేష్, హరినాథగౌడ్, రవి,దయాశంకర్ తెలిపారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ హాజరవుతారన్నారు. ఈడిగ గౌడ కులస్తులు ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఐ అడ్మిన్‌గా మధుబాబు బాధ్యతలు స్వీకరణ

చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త:



జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఐ అడ్మిన్‌గా బి.సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఐ అడ్మిన్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలకంఠేశ్వరరెడ్డి ఇటీవల డిఎస్పీగా పదోన్నతిపై అప్పా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీపై వెళ్ళారు. ఈయన స్థానంలో ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వుల మేరకు హోమ్‌గార్డ్ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న బి.సుధాకర్ బుధవారం ఆర్ఐ అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## రాళ్ల గంగమ్మ ఆలయానికి స్థలం అప్పగింత

శాంతిపురం, జూలై 3 ప్రభాతవార్త



మండల కేంద్రమైన శాంతిపురంలో శ్రీ రాళ్ల గంగమ్మ ఆలయ నిర్మాణానికి ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్థలం అప్పగించారు. స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఐదు సెంట్ల స్థలాన్ని గతంలో సిఎం చంద్రబాబునాయుడు మంజూరు చేయగా అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఆ స్థలంలో గుడి నిర్మాణం చేపట్టరాదని అడ్డుకున్నారు. దీంతో ఇటీవల కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబు నాయుడుకు మాజీ ఎమ్మెల్యే రంగస్వామినాయుడు సతీమణి హేమావతమ్మ, మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్‌లు ఆలయ స్థల విషయంగా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు బుధవారం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఆలయ కమిటీకి అప్పగించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కంచర్లను శాంతిపురం, ఆరిముత్తనపల్లి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, నాగభూష ణంరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, దేవరాజునాయుడు,పురుషోత్తంనాయుడు,నాగరాజు,కేశవులు, అన సూయ, చంద్రకళ, సుగుణమ్మ పాల్గొన్నారు.

## తెదేపా గెలుపుకు మహిళా నేతల కృషి అమోఘం

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

**శాంతిపురం, జూలై 3 ప్రభాతవార్త** సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు మహిళా నేతలు చేసిన క ృషి అమోఘమని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మాజీ సర్పంచ్ నాగభూషణంరెడ్డి మహిళా నేతలకు పట్టు వస్త్రాలు తీసుకురాగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల చేతుల మీదుగా వారికి బహుకరించారు. కార్యక్రమంలో నేతలు నాగభూషణంరెడ్డి, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, ఉయ్యాల జయరాంరెడ్డి, చంద్ర,మణి, రమేష్, అనసూయ, సుగుణమ్మ, చంద్రకళ, శ్యామలమ్మ, రూప, సరిత, వేదవతి, పౌలారాణి, హేమ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకా ంత్ కెనమాకు లపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు బోధనాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ఎవి జయ రాం, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

**రామకుప్పం, జూలై 3 ప్రభాతవార్త** స్థానిక అ ంబేద్కర్ గురుకులం, బాలుర గురుకులం, గద్దూ ్దరు పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు దేశం నేతలు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర నేత మునస్వామి, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, సీతాపతి, రామకృష్ణప్ప, కృష్ణనాయక్, విజయ్‌కుమార్‌రెడ్డి, జయశంకర్, సుబ్రి, మంజునాథ్, అమర్ పాల్గొన్నారు.

## బిసి భవనం కాంపౌండ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి

– బిసి సెల్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షణ్ముగం



చిత్తూరురూరల్, జూలై 3 ప్రభాతవార్త:

బిసి భవనం కాంపౌండ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, ప్రభుత్వ కార్యాకలాపాలకు వినియోగించుకోవాలని తెదేపా బిసిసెల్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షణ్ముగం జిల్లా కలెక్టరును కలసి వినతి చేసారు. చిత్తూరు నడిబొడ్డున వున్న జ్యోతిబాపూలే విగ్రహాన్ని పాతఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతానికి మార్చాలనీ, జిల్లా వ్యాప్తంగా వున్న బిసి సంక్షేమ వసతి గృహాలన పరిశీలించి అన్ని రకాల సౌకర్యాలు వుండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## రేషన్ డీలర్లు జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్ ఎన్నికల

కాణిపాకం, జూలై 3 ప్రభాతవార్త:

జిల్లా రేషన్ డీలర్లు అధ్యక్షుడిగా ఎంఎల్.ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా రేషన్ డీలర్లు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంఎల్ ప్రవీణ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా రవిచంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కెఎం.వేణుగోపాల్, కోశాధికారిగా రవిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 32 మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## నేడు కలెక్టర్‌చే ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కుప్పం, జూలై 3 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం కుప్పం మండల కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గా ఠధీ సుమిత్‌కుమార్‌చే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం పదిగంటలనుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అర్జీల రూపంలో ఉన్నతాధికారులకు అందజేయాలని కోరారు.

## కుప్పం ఆర్టీసీ డిపోను మోడల్ బస్‌స్టేషన్‌గా మార్చుతాం

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, జూలై 3 ప్రభాతవార్త

కుప్పం ఆర్టీసీ డిపోను ఎక్కడాలేనివిధంగా మోడల్ బస్‌స్టేషన్‌గా సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మార్చుతామని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం ఆర్టీసీ డిపోను ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సందర్శించి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత వైకాపా పాలనలో కుప్పం డిపోను నాశనం చేసి ఇక్కడి బస్సులను పుంగనూరుకు తరలించారని మరలా తాము అధికారంలో రాగానే ఇతర ప్రాంతాలకు తరలిన బస్సులతో పాటు కొత్తగా ఐదు బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. అంతకుముందు ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయుఏ నేతలు ఘనంగా సత్కరించారు.అనంతరం డిపోకు సిఎం చంద్రబాబు చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమాల్లో నేతలు గోపీనాథ్, రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, జాకీర్, కార్మిక నేతలు బలరాం, జయపాల్, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మకంపల్లికి నూతనంగా ఆర్టీసీ బస్సు ప్రారంభం

కుప్పం, జూలై 3 ప్రభాతవార్త



మండలంలోని నిమ్మకంపల్లి గ్రామానికి ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు పాలనలో ఒక్కొక్కటిగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని మున్ముందు ప్రజలకు మంచి రోజులు వస్తాయన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో నూతన బస్సు సర్వీసు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రాజశేఖర్, నేతలు ఎవి రవి, సంతూరప్ప, వసంతమ్మ, సుబ్బు, నాగరాజు, వెంకటేష్, విజయ్, గోపి, మణి, కదిరప్ప పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుకు ఆర్థికసాయం

చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త:



అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన పెనుమూరు మండలం ఎల్లంపల్లి గ్రామ రైతు జగన్నాధ నాయుడుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద రూ.35 వేలు అందజేశారు. పెనుమూరు మండలం ఎల్లంపల్లి గ్రామ రైతు జగన్నాధనాయుడు తన పొలంలో వేసిన నేరేడు పంటతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అగ్నిప్రమాదంకు గురై కాలిపోయాయి. ఈ విషయంపై ఆర్థిక సహాయం చేయాల్సిందిగా పెనుమూరు తహసిల్దారును రైతు అభ్యర్థించగా ఈ మేరకు ఈ ప్రతిపాదనలు కలెక్టర్ కార్యాలయానికి పంపారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందిస్తూ రైతు జగన్నాధనాయుడుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద 35 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు.

## ఎమ్మార్పీఎస్ జెండా రెపరెపలాడాలి

చౌడేపల్లి, జూలై 3 ప్రభాతవార్త



ప్రతి మాదిగవాడల్లో ఎమ్మార్పీఎస్ జెం డాను ఎగురవేయాలని ఆ సంఘ జిల్లా కన్వీనర్ హరిబాబు పిలుపు నిచ్చారు. నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులతో స్థాని కంగా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో ఎమ్మార్పీఎస్ ఏర్పడి ఈనెల 7నాటికి 30యేళ్ళు జరుగుతుందన్నారు. ఈనేపథ్యంలో మా దిగ వాడల్లో జెండాను ఎగరేయాలని సంయుక్తంగా తీర్మానించారు. పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాల నాయకులు నాగభూషణం, వెంకట్రమణ, ఆంజప్ప, హరిబాబు, రమణ, రామచంద్రయ్య, ప్రభు, మణికంఠ, రెడ్డెప్ప, కృష్ణయ్య, సుబ్రమణ్యం, సహదేవ, సురేంద్రబాబులు హాజరయ్యారు.

## క్వారీలు తనిఖీ చేసిన తహసిల్దారు

శ్రీరంగరాజపురం, జులై 3 ప్రభాతవార్త:



మండల పరిధిలోని క్వారీలను బుధవారం తహసిల్దారు అల్ఫ్రెడ్, ఎంపిడిఓ మోహన్‌మురళీలు భూగర్భ గనుల శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలో మొత్తం 38 క్వారీలకు మైనింగ్ అనుమతులు వున్నాయి. ఇందులో కటికపల్లి పంచాయతీకి సంబంధించి మైనింగ్‌పై జిల్లా మైనింగ్ సర్వేయర్ నారాయణ, తహసిల్దారు కలిసి మండల పరిధిలో వున్న 11 క్వారీల్లో గతంలోనే పనులు నిలుపుదల చేసి మూసివేశారు. ప్రస్తుతం నాలుగు క్వారీల్లో పనులు జరుగుతున్నాయని అధికా రులు తెలిపారు. క్వారీల్లో రికార్డులు పరిశీలించి అవసరమైన రికార్డులు తీసుకోవడం జరిగిందని తహ ిల్దారు పేర్కొన్నారు. క్వారీలకు సంబంధించిన రికార్డులను జిల్లా అధికారులకు పంపడం జరిగిందన్నారు.

## టిటిడికి కూరగాయల వితరణ

పలమనేరు, జూలై 3 ప్రభాతవార్త:

పలమనేరు పట్టణంలోని శ్రీవారి సేవకులు కాపుపల్లె రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో 10టన్నుల కూరగాయలను బుధవారం పంపిణీ చేశారు.పలమనేరుకు చెందిన కిషోర్ స్వామి,ట్రాన్స్పోర్ట్ యజమాని మోహన్ రెడ్డి,ఎల్లంపల్లె అమరనాథరెడ్డిలు సొంత నిధులతో తిరుమల తిరుపతి దేవస్థానానికి 10 టన్నుల కూరగాయల పంపిణీ చేయడం జరిగింది. ఈ మేరకు స్థానిక మార్కెట్ వద్ద ఆలయ వాహనానికి ప్రత్యేక పూజలు చేసి వాహనాన్ని తరలించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, జులై 3, ప్రభాతవార్త




పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం ఆవరణంలో పారిశుద్ధ్య కార్మికులు దుస్తులు, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు రాత్రనక పగలనక ప్రజల కోసం సేవలు అందిస్తున్నారు. కార్మికులకు ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. కార్మికులకు ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్వచ్ఛ గూడూరుకి సహకరించాలని పారిశుద్ధ్య కార్మికులను విజ్ఞప్తి చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన గూడూరు మున్సిపాలిటీ కుంటుపడిపోయిందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలన కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, శీలం కిరణ్ కుమార్, గుండాల భారతి, పిట్టి నాగరాజు వాటంబెడు శివకుమార్, చాన్ భాషా, ఇజ్రాయిల్ కుమార్, గాయం రమణయ్య, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 3 ప్రభాతవార్త



సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినండి పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోనే ఆయన నివాస గృహంలో పలు సమస్యలపై ఆయన వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. గురుకుల ఆదర్శ వంటి పాఠశాలలో సీట్ల కోసం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సీట్లు పెంచేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఆయన వెంట మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మంకు ఆనంద్ ఉన్నారు.

## గిరిజనుల సమస్యలు హోం మంత్రి దృష్టికి..

రాష్ట్ర ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునెయ్య

వెంకటగిరి, జూలై 3 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని గిరిజన సమ స్యలను రాష్ట్ర హోం మంత్రి వంగల పూడి అనితని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునయ్య కలిసి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాల యం మంగళగిరి నందు తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిటికల్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యని, విజయవాడ నందు ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కూడా ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మునయ్య, మాదిగ ఉద్యోగుల సమైక్య తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు దృష్టికి తీసుకుని పోవడం జరిగింది. దానికి స్పందించిన వారు ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజ్యాంగబద్ధంగా న్యాయ పరమైన విషయాలను మా దృష్టికి తీసుకొస్తే మీ సమస్యలు పరిష్కరించి మీకు అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది.

## పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు వ్యాపించవు

సిడిపిఓ శంషాద్ బేగం



వెంకటగిరి, జూలై 3, ప్రభాతవార్త

అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిడిపిఓ శంషాద్ బేగం కోరారు. అంగన్వాడి కేంద్రాల్లో ఆమె తల్లులతో సమావేశం నిర్వహించి పరిశుభ్రతపై వివరించారు. ముఖ్యంగా తాగునీరు కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. సీజన్ వ్యాధుల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భోజనానికి ముందు చేతులను పరిశుభ్రంగా కడుకోవాలని తెలిపారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్

**గూడూరు, జులై 3, ప్రభాతవార్త**



విద్యార్థులు ఇష్టపడి చదివి, తమ లక్ష్యాన్ని చేరుకోవాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు రెండో పట్టణంలోని జానకి రామ్ పేటలో ఉన్న పురపాలక ప్రాథమిక పాఠశాల నందు ప్రభుత్వం విద్యార్థినీ, విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం ఉండే లక్ష్యన్ని ఎంచుకొని, లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందజేసే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, హెచ్ఎం విజయమ్మ, స్థానిక టిడిపి నాయకులు ఇళత్తూరు పురుషోత్తం మల్లి కళ్యాణ్ బాబు,ఎగ్గిరెడ్డివినయ్ కుమార్, ఆవుల వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయినిలు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్‌సైకిల్ బోల్తా

ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

దొరవారిసత్రం జూలై 3 ప్రభాతవార్త;

మండలంలోని శ్రీధనమల్లి వద్ద మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు బుదవారం తీవ్రంగా గాయపడ్డారు.సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి.సూళ్లూరుపేటకు చెందిన అశోక్,కమలాకర్‌లు మోటార్‌సైకిల్‌పై పూలతోటకు వస్తుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం శ్రీదనమల్లి వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న అశోక్,కమలాకర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పక్కనే ఉన్న గ్రామస్తులు గుర్తించి క్షతగ్రాత్రులను 108సహయంతో చికిత్సనిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు.దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన నేర చట్టాలు అమల్లో ఉన్నాయి

ఎస్ఐ సుధీర్ కుమార్

చిల్లకూరు, జులై 3, ప్రభాతవార్త



చిల్లకూరు మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో చిల్లకూరు ఎస్ఐ సుధీర్ కుమార్ జులై 1వ తేది నుండి అమల్లోకి వచ్చిన నూతన నేర చట్టాలపై వాహనదారులకు, ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ న్యాయాన్ని నిర్ధారించడం, నమ్మకాన్ని పెంచడం, సాధారణ పౌరుడిని శక్తివంతం చేయడం కోసం జులై 1 నుండి నూతన నేర చట్టాలు అమల్లోకి వచ్చాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాలు సంభవించి అవతలి వ్యక్తి మరణించినట్లయితే ఆ ప్రమాదానికి కారణమైన ముద్దాయికి 10 సంవత్సరాల పాటు జైలు శిక్ష పడుతుందని, వాహనదారుడు జాగ్రత్తగా తమ వాహనాలను నడపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## నేటి నుంచి వైకల్య ధ్రువీకరణ శిబిరాలు

తడ, జూలై 3 ప్రభాతవార్త

గురువారం నుంచి వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం సదరం స్లాట్ బుకింగ్ శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు తడ ఎంపిడిఓ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ఆయన చెప్పారు. జులై నుంచి సెప్టెంబర్ దాకా వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకోసం మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ముందస్తు స్లాట్లను బుక్ చేసుకోవచ్చని ఈ సందర్భంగా వివరించారు.

## నేడు విద్యాసంస్థలు బంద్

చిత్తూరురూరల్, జూలై 3 ప్రభాతవార్త:

నీట్, యుజిసి, నెట్ పేపర్ల లీకేజి నిర్లక్ష్యానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ ఈనెల 4వ తేది గురువారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి కళాశాల, పాఠశాలల యాజమాన్యం బంద్‌కు సహకరించాలని కోరారు.

## అమ్మ పేరుతో మొక్కలు నాటిన భాజపా నేతలు


చిత్తూరురూరల్, జూలై 3 ప్రభాతవార్త:



కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడి దేశ ప్రజలనుద్దేశించి ప్రతి ఒక్కరు తమ తల్లులను గౌరవించేలా అమ్మపేరుతో ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొన్న భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు భాజపా నేతలు శ్రీనివాసన్, సురేష్, ఓంకార్, షణ్ముగం, శేఖర్‌లతో కలసి వినాయకపురం, 26వ డివిజన్‌లో అమ్మపేరుతో మొక్కలను నాటారు.

## కలెక్టరును సత్కరించిన దళితసంఘ నేతలు

చిత్తూరురూరల్, జూలై 3 ప్రభాతవార్త:



నూతనంగా పదవీబాధ్యతలు తీసుకున్న జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్‌ను జిల్లా దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. రాష్ట్ర, కేంద్ర బ్యాగ్‌లాగ్ పోస్టులు, ఎస్సీ, ఎస్టీలపై పెండింగ్ కేసులు, బెస్ట్ అవాలబుల్ స్కీమ్, మెసానికల్ మైదానం లోని బిఆర్ అంబేద్కర్ భవనం నందు అసంపూర్తిగా వున్న పనులు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరంగపల్లి మునస్వామి, ధనంజయరావు, దామోదరం, విజయగౌరి, రోజా, కెకె రవి, ఆర్ముగం, విజయభాస్కర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కునత్తంలో రెవెన్యూ సదస్సు

కుప్పంరూరల్, జూలై 3 ప్రభాతవార్త



మండలంలోని చెక్కునత్తంలో రెవెన్యూ అధికారులు సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ, రెవెన్యూ సమస్యలపై ప్రజలనుంచి 76 వినతులను స్వీకరించారు. వీటి పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీఆర్వోలు గోవిందరాజులు, సుభాషిణి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర తెలుగుయువత నేత చెక్కునత్తం మణి, నేతలు గిరి, మునిరత్నం, దేవేంద్ర, తిమ్మప్ప, బాలు, బీరప్ప, రామప్ప పాల్గొన్నారు.

# జడ్పీటిసి నిధులపై శ్వేతపత్రం విడుదల చేయండి



తొట్టంబేడు, జూలై 3 ప్రభాతవార్త

జడ్పీటిసిలకు ఇప్పటి వరకు నిధులు ఎంతెంత కేటాయించారో దానిపై శ్వేత పత్రం విడుదల చేయాలని శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు జడ్పీటిసిలు వెంకట సుబ్బారెడ్డి, కావేరి తిరుమలయ్య, అర్చ నాదేవిలు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి తెలుగుదేశంపార్టీ కండువాలతో హాజరయ్యారు. సమావేశం ప్రారంభలోనే ముఖ్యమంత్రి ఫోటో పెట్టకపోవడంతో ఏర్పేడు జడ్పీటిసి అప్పటికప్పుడే పెట్టాలని డిమాండ్ చేయించి పెట్టించారు. అంతేకాకుండా కొన్ని డిమాండ్లతో కూడిన వినతిపత్రంను సిఈఓ మరియు ఛైర్మన్‌కు అందించారు. ఇందులో మొదటి మూడు డిమాండ్ల ఇప్పటి వరకు జడ్పీటిసిలకి కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, జడ్పీటిసిల వేతనాలకు సంబందించిన వివరాలు తెలియజేయాలని జడ్పీటిసిల విషయంలో అన్నిశాఖల అధికారులు ప్రోటోకాల్ ఖచ్చితంగా పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని , నెలలో ఒక్కసారైనా తిరుపతి జిల్లా అధికారులతో తిరుపతి జిల్లా పరిధి జడ్పీటిసిలతో సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఎస్ఐఐఇ - టిబిఐ, ఎస్పిఎంవివి, ఇ - ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు దరఖాస్తు ఆహ్వానం

తిరుపతి విద్య, జూలై 3, ప్రభాతవార్త

ఎస్పి ఎంవివి సొసైటీ ఫార్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్, ఎంటర్ ప్రెన్యూయర్‌షిప్ (ఎస్ఎస్ఐఐఇ) టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి వారు ఎఫ్ఏబి ల్యాబ్ సరఫరా, ఇన్‌స్టాలేషన్ పరికరాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 5వ తేది నుంచి 29వ తేది వరకు అందుబాటులో వుంటుంది. దరఖాస్తు వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపి ఈప్రొక్యూర్మెంట్.జివోవి.ఇన్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్పిఎంవివి.ఏసి.ఇన్ ఆన్‌లైన్‌లో పొందుపరచి వుంటుంది.

## ఎస్‌వి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి విద్య, జూలై 3, ప్రభాతవార్త

టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్వి ఆర్ట్స్ కాలేజిలో 4 సంవత్స రాల హానర్స్ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరడమైంది. ఓఎ ఎండిసి ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కాలేజీ కోడ్ 20132బిఎ కోర్స్ లో ఇంగ్లీష్, తెలుగు, పాలిటిక్స్, ఎకనామిక్స్ హిస్టరీ, బీకామ్ జనరల్, బీకామ్ సిఏ, బిస్సీ కంప్యూటర్ సైన్స్, ఆక్వా కల్చర్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, ఎలక్ట్రానిక్, బోటని, జువాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్ తదితర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. మెరిట్ ఆధారంగా ఉచిత హాస్టల్ వసతి కల్పించబడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలలో ముగిసిన అడ్మిషన్స్ ప్రక్రియ

తిరుపతి విద్య, జూలై 3, ప్రభాతవార్త

2024 - 25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రవేశాల ప్రక్రియలో భాగంగా అన్ని గ్రూపుల్లో కాలేజ్, హాస్టల్ సీట్లు పూర్తి స్థాయిలో ముగిసినవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి పత్రికా ప్రకటనలో వెలువరించాయి. మొదటి మూడు విడతల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్, ప్రాతిపదికన నిర్వహించి, తదుపరి మిగిలిన కళాశాల సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ముందుగా తిరుపతి స్థానిక విద్యార్థులకు, స్థానికేతర విద్యార్థులకు పదవ తరగతి మార్కుల ప్రాధాన్యత ప్రాతిపదికన పూర్తి గారించడమైనది. ప్రవేశాల ప్రక్రియకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి కళాశాల కార్యకలాపాల నిర్వహణకు సహకరించగలరని తెలియజేయడమైందన్నారు.

## గతుకులకు అతుకులు కొద్దిరోజులే

-ధర్మరాజులస్వామి ఆలయం వద్ద ఇదీ రోడ్డు దుస్థితి



శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి - పిచ్చాటూరు రోడ్డులో ఉన్న ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద ఉన్న రోడ్డు గతంలో గుంతలమ యంగా మారింది. నెలల తరబడి నిద్రమేల్కొన్న అధికారులు గతులకు అతుకులు వేశారు. అయితే ఇటీవల రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకే ఈ రోడ్డు గుంతలమ యంగా మారింది. అంతేకాకుండా చెక్‌పోస్టు వద్ద తరచు నీరు నిలబడిపోవ డంతో ఇక్కడ రోడ్డు గుంతలమయంగా మారింది. ధర్మరాజుల తిరునాళ్ళు సమీపిస్తున్న తరుణంలో ఇకనైనా అధికారులు నిద్రమేల్కొని రోడ్డును బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

## పెన్షన్ల దుర్వినియోగంపై దేశం నేతల ఫిర్యాదు

పెద్దపంజాణి, జూలై 3 ప్రభాతవార్త :

మండలంలోని కొలత్తూరు పంచాయతీ పెన్షన్ల నిధులు దుర్వినియోగంపై తెలుగుదేశం నేతలు ఎంపిడిఓకు ఫిర్యాదుచేసారు. కొలత్తూరు సర్పంచి ఎం.రవి తన కుటుంబసభ్యులను డప్పుకళాకారులుగా నమోదుచేయించి పెన్షన్లుప్రభుత్వంనుంచి అక్రమంగా పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల పెన్షన్ల పంపిణీసందర్భంగా ఈ వ్యవహారం వెలుగుచూసిందన్నారు. గతంలో ప్రభుత్వఅధికారులపై వైకాపాకు చెందిన సర్పంచ్ రవి ఒత్తిడితెచ్చి తమ బంధువులను సైతం డప్పుకళాకారులుగా నమోదుచేయించి గతఐదుఏళ్ళలో దాదాపు ఏడులక్షలకుపైగా పెన్షన్‌సొమ్మును అర్హతలేకున్నా పొందినట్లు వారుపేర్కొన్నారు. అలాగే పంచాయతీ సాధారణ నిధులనుకూడా ధుర్వినియోగం అయినట్లుతమకు తెలిసిందని దీనిపైసైతం తగుచర్యలు తీసుకోవాలని ఎంపిడిఓను వారుకోరారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు పాల్గొన్నారు.

## విద్యకు పేదరికం అడ్డుకారాదు

పెద్దపంజాణి, జూలై 3 ప్రభాతవార్త :



విద్యకు పేదరికంఅడ్డుకారాదని గురుశిష్య సేవాసంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తులసమ్మగుడి యుపిస్కూల్‌లో చదువుతున్న విద్యార్థినివిద్యార్థులకు పలమనేరు గురుశిష్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచితంగానోటు పుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు మాట్లాడుతూ..విద్యార్థులు తమతల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడిచదివి ఉన్నతస్థాయికిఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘకార్యదర్శి వీరబద్రగౌడు, హెచ్ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు వినాయక, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పార్కింగ్ రుసుం లీజు బహిరంగ వేలం ద్వారా 1,87 కోట్లు ఆదాయం

కాణిపాకం, జూలై 3 ప్రభాతవార్త:

కాణిపాకం గ్రామ పంచాయతీకి వామన పార్కింగ్ రుసుం వసూలు లీజు బహిరంగ వేలం ద్వారా 1.87 కోట్లు ఆదాయం లభించినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి తెలిపారు. బుధవారం 07-07-24 నుండి 31-03-2025 వరకు కాణిపాకం గ్రామపంచాయతి, కాణిపాకం దేవస్థానంలకు సంభందించి వాహన పార్కింగ్ రుసుం లీజు బహిరంగ వేలంను పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 1,87,29,999 రూపాయలు ఆదాయంగా లభించినట్లు ఆయన తెలిపారు. ఈ వేలం పాటలలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారస్థులు పాల్గొన్నారు.

# తుమ్మలగుంట పంచాయతిలో ప్రజా సమస్యలు పరిష్కరించండి

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన టిడిపి నేత దొడ్ల కరుణ

తిరుపతిరూరల్, జూలై 3 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతిలో ప్రజా సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, అధికారులు స్పందించి పరిష్కరించాలని టిడిపి ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేసారు. బుధవారం జరిగిన పంచాయతి సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసి, ప్రశ్నించారు. పంచాయతి పరిధిలోని ఉప్పరపల్లి స్మశానవాటిక, కమిటీ భవనం, అంగన్‌వాడీ భవనం, నీటి కుళాయిలలో జరిగిన అవినీతి, అరుంధతిపురంలో స్మశాన ప్రహరీ గోడ నిర్మాణం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. తుమ్మలగుంట గ్రామంలో రోడ్లు, మురుగు కాల్వలు, త్రాగునీటి పైపులు, అండర్ డ్రేనేజ్ అస్తవ్యస్తంతో పాటు రజకులకాలనీ రోడ్డు, యాదవుల వీధి, మంగలోళ్ళ వీధులలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. తుమ్మలగుంట గ్రామ పంచాయతిలో కొత్తగా ఇళ్ళు నిర్మించుకున్నవారికి కరెంట్ మీటర్లు ఇవ్వాలని, రోడ్లపైకి అక్రమంగా నిర్మించిన ఇండ్లను తొలగించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నెలా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం

-బొజ్జలబృందమ్మ



శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త

హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పూసలవీధిలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ అధినేత మునీర్‌భాషా ఆధ్వర్యంలో 150వ నెల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ విచ్చేసి ప్రత్యేక ప్రతిభావంతులకు, పేదలకు నిత్యావసర సరుకులను, దుప్పట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బొజ్జలబృందమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని పేదలకు వారి వంతు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, మైనార్టీనాయకులుషాకిరాలీ, హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు గరికపాటిరమేష్‌బాబు, బాబాఫరీద్ పాల్గొన్నారు.

## ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఎంజిఎం విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త



పట్టణంలోని ఎంజిఎం పాఠశాల విద్యార్థులు 2023-24 సంవత్సరంలో ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటినట్లు ఎంజిఎం విద్యాసంస్థల ఛైర్మన్ గుడ్లూరు మయూర్ తెలిపారు. రెండో తరగతి చదువుతున్న వి.ధరణికార్తీక రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు, బి.నిఖిల్ రవిసాయి, గణితంలో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు, 8వ తరగతి చదువుతున్న లిఖిత్ కుమార్ రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సైన్సు సబ్జెక్ట్‌లో ర్యాంకులు సాధించారు. రౌండ్ నంబర్ 2 ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం సంతోషం అన్నారు. 6మంది విద్యార్థులు ఎక్సెన్స్ మెడల్ ర్యాంకు సాధించడంతోపాటు ఒకటో తరగతి చదువుతున్న 36మంది విద్యార్థులు, రెండో తరగతది విద్యార్థులు 16మంది, మూడో తరగతి విద్యార్థులు 16మంది విద్యార్థులు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ నుంచి పాల్గొనగా వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మునిరత్నంనాయుడు విద్యార్థినీ విద్యారర్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు.

## పెంచిన పెన్షన్లపై బృందమ్మకు సత్కారం

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త

ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ గత రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సామాజిక భద్రతా ఫించన్లను అందుకున్న లబ్దిదారులు విన్నపాలను బొజ్జలబృందమ్మ వారి నుంచి స్వయంగా విన్నారు. ఈసందర్భంగా ఫించనుదారులను కలవడానికి వెళ్ళిన బృందమ్మతో కొందరు లబ్దిదారులు మాట్లాడుతూ పెన్షన్ మొత్తం రూ.7వేలు తమకు అందించి తమకు అండగా నిలచిన ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు, ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సభ్యుల చేత తమ పనులు చేయించుకుంటూ కదలలేని స్థితిలో ఉన్న హామీదా బేగం అనే యువతికి సాధారణ వికలాంగులకు ఇస్తున్నట్లుగా ఫించను ఇవ్వడం తెలుసుకున్న బృందమ్మ వైద్యులచేత పరీక్ష చేయించి పూర్తిస్థాయిలో ఫించను అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పురపాలక సంఘ 18వ వార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదితమోరే, తెదేపాపార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం, మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్‌బాషా, రియాజ్, హబీబ్, నాయిబ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్‌మీడియా కన్వీనర్ కోటచంద్రశేఖర్, బిసి నాయకులు మునిరాజయాదవ్, పాండు, కృష్ణమూర్తి, భాస్కర్, మణి, వంశీ, శేషు, శివ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి రూ.2.50లక్షలు విరాళం

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సహకారంతో నిర్వహించే నిత్యాన్న దాన పథకానికి బుధవారం హైదరాబాదు వనస్థలిపురానికి చెందిన వి.రా మకృష్ణరావు, మధుకుమార్‌లు అన్న దానానికి రూ.2.50లక్షలు విరాళాన్ని ఆలయాధికారులకు అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామి అమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించి తీర్ధ ప్రసాదాలుఅందించారు. కార్యక్రమంలో డిప్యుటీ ఈవో ఏకాంబరం, ఎన్ఆర్.కృష్ణారెడ్డి, ఎఈవో సతీష్‌మాలిక్, లక్కమనేని మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకహోదాపై మాట్లాడే హక్కు సుబ్బారెడ్డికి లేదు

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త



ప్రత్యేకహోదా గురించి మాట్లాడే హక్కు వైవి.సుబ్బారెడ్డికి లేదని తిరుపతి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షులు యం.సుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో అధికారంలో ఉన్నపుడు 22మంది ఎంపిలు ఐదేళ్ళు ప్రత్యేకహోదా గురించి పార్లమెంటులో కనీసం ఎన్నడూ ప్రస్తావించలేదని నేడు వైవి సుబ్బారెడ్డికి ప్రత్యేకహోదా గురించి మాట్లాడే హక్కులేదన్నారు. కనీసం రాష్ట్రానికి రాజధానిగా చేసిన వైకాపా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన తీర్పుఇచ్చారన్నారు. ప్రస్తుతం ఎన్డీయేకూటమిలో ఉన్న ఎంపిలు ప్రత్యేకహోదాపై చర్చిస్తారన్నారు.

## తంగేళ్ళపాళెం పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి నియామకం



.తొట్టంబేడు, జూలై 3 ప్రభాతవార్త

మండలంలోని తంగేళ్ళపాళెం సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జిగా శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవిబాబు బాధ్యతలు స్వీకరించారు. సింగిల్ విండో త్రీమెన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న పి.మణిబాబునాయుడు గత నెల 9వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో సింగల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జిగా పి.రవిబాబును నియమించారు. ఈసందర్భంగా సిఈఓ పి.చిరంజీవిరెడ్డి అభినందించారు. రైతులకు పంటరుణాలను మరియు దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు సకాలంలో అందిస్తామని రవిబాబు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## బంద్‌ని జయప్రదం చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ పిలుపు

నగరి, జూలై 3 ప్రభాతవార్త:

నగరిలో గురువారం నిర్వహించనున్న దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం ఐక్య విద్యార్థి సంఘాలతో పాటు ఎంఈవోను కలసిన ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయకుమార్ బంద్ ఆవశ్యకతను ఎంఈవోకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. అన్ని విద్యాసంస్థల యాజమాన్యాల బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు బాషా, రోహిత్, కామరాజు, ముని, విశాల్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభ్యసనా సామగ్రి వితరణ

నగరి, జూలై 3 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బాల మురుగన్ స్టోర్స్ యజమాని రాధాకృష్ణ విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన ఆయన ఎంఈవో నమఃశివాయం ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దాత సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యాపరంగా ఎదగాలన్నారు. అనంతరం దాతను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కవిత, పీసీ ఛైర్మన్ వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, జూలై 3 ప్రభాతవార్త:

రేణిగుంట రైల్వేస్టేషన్ 1 నెంబర్ ప్లాట్‌ఫాం చివరిలో కడప వైపు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి(55) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గౌరీశంకర్ తెలియజేశారు. మృతుడు తెల్ల రంగు ప్యాంటు, ముదురు గులాబీ రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిస్తే 9885753379 మొబైల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ గౌరీశంకర్ తెలిపారు.

## చంద్రబాబుకు దివ్యాంగులు పాలాభిషేకం

విజయపురం, జూలై 3 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన విజయపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల పింఛన్ నెలకు రూ.6 వేలు పెంచడంతో దివ్యాంగుల్లో రెట్టింపు ఆనందం వచ్చిందని, దివ్యాంగులకు ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. చంద్రబాబునాయుడు వలనే దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, దివ్యాంగుల మండల అధ్యక్షుడు ఏసుపాదం, దివ్యాంగులు భాస్కర్‌నాయుడు, సంజీవరాజు, రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

విజయపురం, జూలై 3 ప్రభాతవార్త:



మండలంలోని ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాలలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు కావలసిన నోటు పుస్తకాలు, క్రయాన్స్, పెన్నులు, పెన్సిల్ తదితర సామగ్రి వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంశీకృష్ణ, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం

ఏర్పేడు, జూలై 3 ప్రభాతవార్త;



తిరుపతి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు తమ వంతు కృషి చేద్దామని ఎస్ఓఎస్ లొకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజెస్ ఇండియా తిరుపతి వారు తమ కుటుంబ బలోపేత కార్యక్రమం కింద బుధవారం తిరుపతి జిల్లాలో బాల్య వివాహాలను నిరోధించే ప్రచారాన్ని ప్రారంభించారు. యూనిసెఫ్ నివేదిక ప్రకారం బాల్య వివాహాల ప్రాబల్యంలో భారతదేశంలో అత్యధికంగా 29శాతం రేటుతో ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉండగా, రాష్ట్రంలో అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాలలో తిరుపతి ఒక జిల్లాగా ఉందన్నారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగించేందుకు ఏర్పేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి తదితర మండలాల్లో సుమారు 14గ్రామాల్లో వాల్ పెయింటింగ్ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమం ప్రారంభించారు. ఎస్ఓఎస్ సిబ్బంది మునిరత్నం మరియు అనిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల చదువు దేశానికి వెలుగు

ఏర్పేడు, జూలై3, ప్రభాతవార్త;



బాలికల పూర్తి చదువు, దేశానికి వెలుగు క్రై పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న పూరీ పఢై దేశ్‌కి భలై కార్యక్రమంలో భాగంగా ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మంలంలోని పంగూరు హైస్కూల్ నందు 39మంది అమ్మాయిలను చేర్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంఈవో దయాకర్ ఆడపిల్లల యొక్క చదువు విశిష్ఠతను గురించి తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆడపిల్లల చదువు దేశానికి, సమాజాభివృద్ధికి ఎలా ఉపయోగపడతారో వివరించారు. పాఠశాల సిబ్బంది. ప్రగతి సంస్థ సిబ్బంది శిరీష, సిఆర్‌పి, అంగన్వాడి టీచర్లు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గిపేరిలో ఘనంగా సత్యమ్మ జాతర

ఏర్పేడు, జూలై3, ప్రభాతవార్త;



మండలంలోని దుర్గిపేరి గ్రామంలో బుధవారం గ్రామస్థులు ఘనంగా సత్యమ్మ జాతర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్దలతో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ వేడుకల్లో రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని అమ్మ వారి సేవలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాలలో విశ్వం విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (క్రీడ) జూలై 3 ప్రభాతవార్త:




జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి రెండోవ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాలలో విశ్వం విద్యార్థులు యశ్విన్‌కుమార్, బేరి, భారత్, మోహిత్, వంశితశ్రీలు విజయఢంకా మ్రోగించారని, వీరితో పాటు 52మంది విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించినట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాధరెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వనాధరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి కరస్పాండెంట్ యస్.తులసీ విశ్వనాధ్‌లు విద్యార్థులను అభినందించారు.

## జిఎన్‌కండ్రిగ నది నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

నారాయణవనం, జూలై 3 ప్రభాతవార్త :

మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ గోవిందప్పనాయుడుకండ్రిగ అరుణానది నుంచి ఇసుకను తరలించకుండా పుత్తూరు ఎస్ఇబి అధికారులు, స్థానిక రెవెన్యూ అధికా రులు చర్యలు తీసుకున్నారు. స్థానిక ప్రజలు నది నుంచి ఇసుకను విచ్చలవిడిగా తవ్వి తర లిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో బుధవారం మధ్యాహ్నం జెసిబితో నది లోపలికి వెళ్లకుండా గుంత తవ్వేశారు. ఈ సందర్భంగా ఒక ఇసుక ట్రాక్టర్ సీజ్ చేశామని సిఐ వై.ఉరుకుందమ్మ తెలిపారు. ఆ ట్రాక్టర్‌ని పుత్తూరు సివిల్ పోలీసులకు అప్పగించడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే ఇద్దరు ఐడి ముద్దాయిలు వద్ద ఒక్కొక్కరి నుంచి 10వేల చొప్పున 20వేల రూపాయాల జరిమానం విధించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణరాజు, రెవెన్యూ, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ నిధులలో ఆసుపత్రికి మందులు కొనుగోలు చేయండి

## ప్రభుత్వ ఆసుపత్రి , పట్టు ఉత్పత్తి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్




ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

పలమనేరు,జూలై 3,ప్రభాతవార్త:
స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు,వస్తువులను ఆరోగ్య శ్రీ నిధులలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య శాఖ అధికారులకు సూచించారు.పలమనేరులో బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, పట్టు ఉత్పత్తి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలను ఆయన ఆరా తీశారు.రోగులతో ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి కావలసిన పరికరాలను,మందులను ఆరోగ్య శ్రీ నిధుల ద్వారా కొనుగోలు చేయాలని డిసిహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డికి సూచించారు.డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వైద్య సిబ్బందిని తిరిగి వెనక్కు తీసుకురావాలని ఆదేశించారు.ఆపరేషన్ థియేటర్‌లో అవసరమైన బాయిల్స్ ఆపరేటర్స్ కొనుగోలుకు కలెక్టర్ నిధుల నుండి రూ.2లక్షలు మంజూరు చేశారు.ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్యం,ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఆసుపత్రిలో చిన్న పిల్లల,ఎముకలు,చర్మవ్యాధి నిపుణులు,జనరల్ ఫిజీషియన్,రేడియాలజిస్ట్ డాక్టర్ల కొరత ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.మమతారాణి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఈ అంశాని పరిశీలిస్తామని ఆయన తెలిపారు.అనంతరం పట్టుగూళ్ళ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రైతులు,రీలర్లతో వారి సమస్యలపై చర్చించారు.ప్రస్తుత పట్టుగూళ్ళ ఉత్పత్తి,పట్టుదారము ధరలపై ఆరా తీశారు.పట్టుగూళ్ళ ఉత్పత్తి పెంచుటకు అవసరమైన సదుపాయాలు,దిగుబడి పెంచుటకు అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టుపరిశ్రమ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పట్టుపరిశ్రమల శాఖ జేడి శోభారాణి,ఆర్‌డిఓ మనోజ్ కుమార్‌రెడ్డి,తహసీల్దార్ రంగనాయకులు,ఏడి కిషోర్ నాయక్,గ్రైనేజ్ ఇంచార్జ్ నగేష్,పట్టుగూళ్ళ విక్రయకేంద్ర అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ పరీక్షా సంస్థలో

# తక్షణ సంస్కరణలు అవసరం

### తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి



తిరుపతి హెల్త్, జూలై 3, ప్రభాతవార్త
దేశంలో వైద్య విద్యను అభ్యసించేందుకు సుమారు 2.4 కోట్ల మంది విద్యార్థులు నీట్ ద్వారా పోటీ పడుతుండగా ఈ ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతను జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టిఏ) భుజానకెత్తుకుంది. అయితే ఇటీవల జరిగిన నీట్ ప్రవేశ పరీక్షలో అవకతవకలు, ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రాలు పరీక్ష కంటే ముందు బహిర్గతం అయ్యాయి. లాంటి ఆరోపణలతో ఆ ప్రవేశ పరీక్ష రద్దు చేయడం. అలాగే యూజీసీ - నెట్ పరీక్ష కూడా రద్దు కావడంతో పలు ఆందోళనలను రేకెత్తిస్తుంది అన్నారు. ఈ పరిణామాలు సంవత్సరాల తరబడి ఈ ప్రవేశ పరీక్ష కోసం కఠినమైన అభ్యసనా, విలువైన సమయం, పెట్టుబడిగా పెట్టిన అసంఖ్యాక విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని అలాగే జాతీయ పరీక్షా సంస్థలోని వ్యవస్థాగత సమస్యలను హైలైట్ చేస్తుందని గౌరవ సభ ద్వారా తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఇలా పదేపదే జరుగుతున్న వైఫల్యాల వలన ఏర్పడిన అనిశ్చితితో సురక్షితమైన, విశ్వసనీయమైన ప్రవేశ పరీక్ష విధానాన్ని అందించగల జాతీయ పరీక్షా సంస్థ సామర్థ్యం పై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని వైద్య విద్యను అభ్యసించాలి అనుకుంటున్నా ఆశావహుల విశ్వాసం కోల్పోకుండా నిరోధించడానికి, ప్రభుత్వం అత్యవసరంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## రాహుల్‌గాంధీ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి

### - బిజెపి చిట్టిబాబు డిమాండ్




చిత్తూరురూరల్, జూలై 3 ప్రభాతవార్త:
హిందూ దేవుళ్ళ, ,హిందూ సమాజంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ సీనియరు నాయకులు చిట్టిబాబు కొల్లా డిమాండ్ చేసారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రక్రియకు కొనసాగింపుగా కేంద్రంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హిందూదేవుళ్ళ,హిందూ సమాజంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గాంధీ విగ్రహం సర్కిల్ నందు భారతీయ జనతాపార్టీ, విశ్వహిందూ పరిషత్ సంయుక్తంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగావుందన్నారు. రాజ్యాంగ పద్దతులకు, సభా సాంప్రదాయాలకు భిన్నంగా దేవుళ్ల పోస్టర్లను, వస్తువులను పార్లమెంటులోనికి తీసుకొని వచ్చినందుకు వారిని సభనుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేసారు. ఈ నిరసన కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, రామభద్ర, కరుణాకరసిద్ద, పోతపాల రామమూర్తి, తోళపాళ్యం వెంకటేష్, హరిబాబుచౌదంరి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక కష్టాలు ఉన్నా మాట తప్పని వ్యక్తి సిఎం చంద్రబాబు

### - ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, జూలై 3 ప్రభాతవార్త
రాష్ట్రాన్ని మాజీ సిఎం జగన్ 13లక్షల కోట్ల మేర అప్పుల పాలు చేసినా ప్రజలకు ఇచ్చిన మాట తప్పని వ్యక్తి సిఎం చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి పలార్లపల్లిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా పేద అవ్వతాతలకు ఇచ్చిన మాట మేరకు పెన్షన్లను నాలుగు వేలకు పెంచారన్నారు. ఈ నెల పెన్షన్‌తో పాటు ఏప్రిల్ నుంచి తలా వెయ్యిరూపాయల వంతున మొత్తం ఏడువేల రూపాయలను పెన్షన్ రూపంలో ఉదయం ఆరుగంటలకే అవ్వతాతలకు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అలాగే దివ్యాంగులకు ఆరువేల రూపాయలను అందించడం జరుగుతోందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాల కోసం 16347పోస్టులతో కూడిన మెగా డిఎస్సీ ఫైలుపై సిఎం చంద్రబాబునాయుడు తొలిసంతకం చేశారన్నారు. యువతకు అనుగుణంగా ఇప్పటికే టెట్ పరీక్ష నిర్వహించి ఉన్నా మిగతా వారికోసం మరోమారు టెట్ నిర్వహణకు సైతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారన్నారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే రేషనలైజేషన్‌తో మూసివేసిన ప్రైమరీ స్కూల్‌ను తెరిపించాలని సీనియర్ నేత మురుగేష్ కోరారు.దీనిపై ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు గోపీనాథ్, శాంతారాం,మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు రాజేంద్ర, ప్రతాప్, నేతలు సత్యేంద్రశేఖర్,కన్నన్, ఆర్ముగం, ప్రతాప్‌సింహా, శివశ ంకర్, చెక్కునత్తం మణి తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 18 మందికి జరిమానా

### జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్

తిరుపతి కార్పొరేషన్, జులై 3, ప్రభాతవార్త
డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 18 మంది నిందితులకు జరిమానా కోర్టు విధించినట్లు జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్ తెలిపారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 18 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరిచారు. జడ్జి గ్రంథి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 18 మందికి 1,80,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా రోడ్డుకి ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న 40 మందిపై యు/ఎస్ 283 ఐపిసి ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టగా ఒక్కొక్కరికి 200 రూపాయిలు చొప్పున మొత్తం రూ. 8 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు అభినందించి, యాత్రికుల తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

# అర్జీలకు త్వరితంగా పరిష్కారం

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త: సిఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల కుప్పం పర్యటన సందర్భంగా ప్రజల నుండి సిఎంకు అందిన అర్జీలను పరిశీలించి త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశమందిరంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు జూన్ 25, 26 తేదీల్లో కుప్పం పర్యటించారని, ఈ సందర్భంగా సిఎం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 114 అర్జీలు సమస్యలపై అందాయన్నారు. ఈ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు నివేదికను సిద్ధం చేయాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను త్వరితంగా పరిష్కరించాలని, సర్వీసెస్, ఆర్థిక సంబంధిత అర్జీల వివరాలను సంబంధిత ఉన్నత అధికారులకు నివేదిక పంపాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబరు లేని వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్థవంతంగా పరిష్కరించాలన్నారు. మరో పది రోజుల్లో ఇదే అంశంపై సమీక్ష వుంటుందని అప్పటిలోపు అన్ని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డ్వామా పిడి రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హైకోర్టు ప్రభుత్వ సహాయ ప్లీడర్‌గా అడవిబూదుగూరు వాసి



శరత్‌కుమార్

కుప్పం, జూలై 3 ప్రభాతవార్త
ఎపి హైకోర్టు ప్రభుత్వ సహాయ ప్లీడర్‌గా శరత్‌కుమార్‌ను నియమిస్తూ న్యాయవ్యవహారాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి సునీత ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం మండలం అడవిబూదుగూరు గ్రామానికి చెందిన శరత్‌కుమార్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేసేవారు. తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ విభాగంలో పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ సహాయ ప్లీడర్‌గా నియమితులు కావడంతో స్థానిక దేశం నేతలు, జనసేన నేతలు హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లపాటు ఈ పదవిలో న్యాయవాది శరత్‌కుమార్ కొనసాగుతారు.

# శృతిమించితే చర్యలు తప్పవు చట్టవ్యతిరేక శక్తులపై గట్టి నిఘా



తిరుపతి,జులై 3ప్రభాతవార్త:
ప్రశాంతతకు మారుపేరైన తిరుపతి జిల్లాలో యాత్రాస్థలం తిరుపతినగరంలో శృతిమించితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తమతమ పరిధిలో, న్యాయ,చట్టపరంగా వ్యవహరించాలని అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చంద్రబాబుముఖ్యమంత్రిగా బాధ్యతలతో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలనియంత్రణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పోలీసులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్పీ హర్షవర్థన్‌రాజు ఆదేశాలతో తిరుపతి డిఎస్పీ రవిమనోహరాచారి, తన క్రిందిస్థాయి సిఐలు, ఎస్ఐలతో పగలు,రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు, ప్రాంతాలు, కాలనీల తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడైనా యువత, మందుబాబులు, ఆకతాయిలు, చట్టవ్యతిరేక శక్తులు తమతమ కార్యకలాపాలు సాగిస్తున్నా పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. ప్రతిరోజూ మెరుపు తనిఖీలతో ఈ దాడులు కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు బహిరంగంగా మద్యం సేవించిన వారిపై 1215 కేసులునమోదుచేసి, 1227మందికి కోర్టులో జరిమానాలు విధించేలా చూశారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు కొనసాగుతూన్నయి .చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ రవిమనోహరాచారి హెచ్చరించారు.

# గుడిని గోపురాన్ని వేరు చేస్తారా...?

### -ఆక్రమణలను అరికడితేనే ప్రతిష్టాపన



చౌడేపల్లి, జూలై 3 ప్రభాతవార్త
పునర్నిర్మాణం పేరుతో గుడిని గోపురాన్ని వేరు చేస్తారా... ముందుగా ఆక్రమణలు తొలగించి ప్రతిష్టాపనకు రండి...అంటూ గ్రామస్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ సముదాయ ఇఓ కమలాకర్‌ను నిలదీశారు. విషయానికొస్తే సనాతన ధర్మ పరిరక్షణార్థం పట్టణంలోగల శతాబ్దాల చరిత్రగల రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం జీర్ణోద్ధరణ దిశగా పరుగులు తీసింది. దాదాపు రూ. 3కోట్లు వెచ్చించి ఆలయాన్ని పునర్నిర్మించారు. నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆలయ సముదాయ ముఖ్య కార్యనిర్వహణాధికారి కమలాకర్‌రావు ఆలయానికి వచ్చారు. స్వామివారి ప్రతిష్టాపనకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. తాము ప్రతిష్టాపనకు అడ్డు కాదనీ, అయితే ఆలయ నిర్మాణాన్ని ధర్మ విరుద్ధంగా నిర్మించారని ఇఓను నిలదీశారు. గుడిని గోపురాన్ని వేరు చేస్తూ ప్రహరీ గోడను నిర్మించారనీ, ఆలయ ప్రాంగణంలో నివాసాలున్న కారణంగా పలు దుశ్చర్యలు చోటు చేసుకొంటాయని వినాయక యుజన సంఘం ఆరోపించింది. గాలిగోపురం బయట వుండటం వల్ల ఆచార్య వ్యవహారాలకు దూరంగా వుండాల్సిన వారందరూ గోపురం నుంచి లోనిక వస్తారనీ, దీనివల్ల హిందూ సాంప్రదాయంతో పాటు ఆలయ ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. వేణుగోపాలస్వామి ఆలయానికున్న మాన్యాలు, చుట్టుపక్కల దురాక్రమణకు గురైన స్థలంలో కట్టడాలను తొలగించి ప్రాంగణంలో వున్న వారికి దారి చూపించిన తర్వాత ప్రతిష్టాపన పెట్టుకొందామని వారందరూ ముక్తకంఠంతో ఇఓ కమలాకర్‌రావుకు మొర పెట్టుకొన్నారు. దీంతో చేసేది లేక ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని నిష్క్రమించారు. కాగా వేణుగోపాలస్వామి గాలి గోపురాన్ని పురాతన దేవాలయాల పునర్నిర్మాణదాత, బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్.కె.వెంకట్రమణారెడ్డి తన సొంత నిధులు రూ. 50లక్షలు వెచ్చించి నిర్మిస్తే దానికి నగిషీ పనులు చేయించి లక్షలాది బిల్లులు పెట్టుకొన్నారని పలువురు బహిరంగంగానే విమర్శించారు.

# కల్యాణ వెంకన్నకు పరదాల మణి 2 కురాళాలు విరాళం



చంద్రగిరి, జూలై 3 ప్రభాతవార్త:
తిరుపతికి చెందిన పరదాల మణి శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి బుధవారం రెండు కురాళాలను విరాళంగా అందజేశారు. కలియుగ వైకుంఠవాసుడి పట్ల అచెంచల భక్తి విశ్వాసాలతో గత 15 ఏళ్ళుగా ఏడాదికి రెండు పర్యాయాలు స్వామి వారికి కురాళాలను విరాళంగా అందిస్తున్నారు. ఇందులో భాగంగా తన కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి చేరుకున్న ఆయన ఆలయ అధికారులకు రెండు కురాళాలను అందజేశారు. ఈ కురాళాలను ఒకటి గర్భగుడి ముందు, మరొకటి కులశేఖరపడి వద్ద ఏర్పాటు చేయనున్నారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, అర్చకులు నారాయణాచార్యులు, సిబ్బంది చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షమేరకు సిఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి

### -ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



తిరుమల,జులై 3ప్రభాతవార్తప్రతినిధి:
రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగించి, రాష్ట్రాన్ని అభివృద్ధిచేస్తారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం బారులు



నగరి, జూలై 3 ప్రభాతవార్త:
గ్యాస్ పుస్తకాలను తీసుకెళ్లి ఈకేవైసీ చేసుకోవడానికి వినియోగదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. వెలుగు పథకంలో ఉన్న వారికే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్న ప్రచారం ఊపందుకోవడంతో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ముందు వినియోగదారులు క్యూ కడుతున్నారు. కొన్ని గంటల పాటు వేచి ఉండి మరీ ఈకేవైసీ చేసుకుని వస్తున్నారు.

# ధర్మరాజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

## 24నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం



చెన్నైరోడ్డులో ఉన్న ధర్మరాజులస్వామి ఆలయం

శ్రీకాళహస్తి,జూలై 3 ప్రభాతవార్త
పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాలజిల్లుతోంది. పాడి పంటలకు నిలయమైన తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పంటలు చేతికొచ్చిన తరువాత గ్రామాల్లో పొంగళ్లు పెడతారు. కొలుపులు నిర్వహిస్తారు. జాతర సంబరాలు నిర్వహిస్తారు. శ్రీకాళహస్తిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవాలు, ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తారు. ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవాలు బ్రహ్మోత్సవాలుగా నిర్వహిస్తారు.అన్ని వేసవి కాలంలో నిర్వహించటం ఆనవాయితీ.ఈ నేపథ్యంలో సోమవారం నుంచి శ్రీకాళహస్తిలోని ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో భారత పఠనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

**శ్రీకాళహస్తి చుట్టుపక్కల గ్రామాలకు సంబరాలు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చుట్టుపక్కల సుమారు 40 గ్రామాలకు కేంద్ర బిందువు. ఇది వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది, నిత్యం ప్రజల రద్దీతో కిట కిట లాడుతుంటుంది. స్వర్ణముఖి పరివాహాక ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో వ్యవసాయం ప్రధాన వ్యాపకంగా ఉంది.ఇక్కడ నిర్వహించే ఉత్సవాల్లో ధర్మరాజుల స్వామి తిరునాళ్ళు ముఖ్యమైనది.ఈ ఉత్సవాలను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తిరునాళ్ళుగా పిలుస్తారు.పురాతన కాలంలో గ్రామ పొలిమేరల్లో చక్కటి ఆలయం నిర్మించారు. ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తారు. భారత పఠనంలోని ప్రధాన ఘట్టాలను వీధినాటకంగా ప్రతి రోజూ నిర్వహిస్తారు. చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య సారథ్యంలో నిర్వహించుటకు చర్యలు తీసుకున్నారు. సోమవారం ఇక్కడ ఉత్సవాలకు సంబంధించి లక్ష్మయ్య కొత్త ఇఓ ఎన్వియస్ మూర్తికి వివరించారు. ఈ ఏడాది ఉత్సవాలు కొత్త ఇఓ సారథ్యంలో నిర్వహించ నున్నారు. ఉత్సవాల్లో ప్రధానంగా 12న ధ్వజారోహణం, 16న కళ్యాణోత్సవం, 21న అగ్నిగుండ మహోత్సవంతో కార్యక్రమాలు పూర్తవుతాయి. ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేసారు.ఆలయాన్ని చూడ ముచ్చటగా ముస్తాబు చేస్తున్నారు. ఈఉత్సవాలు పూర్తయిన తర్వాత ఈనెల 24వ తేదీ నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నారు.